క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నకూటోత్సవం



అన్నకూటోత్సవాన్ని నిర్వహించిన దృశ్యం

డోన్ : ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా స్థానిక వేంకటేశ్వర ఆలయంలో ఆదివారం అన్నకుటోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వేకువ జామున భక్తిశ్రద్ధలతో ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ, రాము శర్మ అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ధర్మకర్తలు పాతాళం సుబ్బారావు, శ్రీనివాసరావు, రజనీకుమారి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న మిత్రబృందం

డోన్ టౌన్: మృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి మిత్రులు తమవంతు ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. పట్టణంలోని ఏస్కేపీ హైస్కూల్‌లో 1994–95వ సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న ఓ మిత్రబృందంలో శంకరయ్య గుండెపోటుతో మృతి చెందారు. స్నేహితులు రూ.51వేలు జమ చేసి ఆదివారం మృతుని భార్య శ్రీదేవికి అందజేసి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మిత్రులు డిప్యూటీ తహసీల్దార్ మారుతి, జలీల్, సురేంద్రగౌడ్, వెంకటేష్, కుమార్, సురేష్, శేఖర్, వెంకటకృష్ణ, రవి, ఓబులేసు, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలమద్దయ్యకు డాక్టరేట్



ప్యాపిలి: మండల పరిధిలోని వెంగళాంపల్లి గ్రామానికి చెందిన కొమ్మ మద్దిలేటి, సుంకమ్మల కుమారుడు బాలమద్దయ్యకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. పొలిటికల్ సైన్స్ పరిశోధనా పర్యవేక్షకుడు బి. ఉదయ్‌ప్రకాశ్ పర్యవేక్షణలో బాలమద్దయ్య 'స్వచ్ఛ్ భారత్‌యాన్ ఇన్షియేటివ్ ఇన్ ఇంప్రూవింగ్ అర్బన్ శానిటేషన్ ఇన్ ఇండియా.. విత్ స్పెషల్ రిఫరెన్స్ టూ గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించారు. ఈ మేరకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు బాలమద్దయ్య తెలిపారు.

లైవ్ సర్టిఫికెట్ ఇవ్వాలి



మాట్లాడుతున్న భానుసింగ్

డోన్ టౌన్: పెన్షన్ పొందుతున్న ప్రభుత్వ ఉద్యోగులు ఫిబ్రవరి నెలాఖరు లోపు లైవ్ ప్రమాన్(లైవ్ సర్టిఫికెట్)స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయంలో అందజేయాలని స్టేట్ పెన్షనర్స్ అసోసియేషన్ సంఘం డోన్ అధ్యక్షుడు భానుసింగ్ తెలిపారు. స్థానిక పెన్షనర్ల భవనంలో ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. లైవ్ ప్రమాన్ సర్టిఫికెట్ కోసం త్వరలో కంప్యూటర్ ఏర్పాటు గురించి చర్చించారు. ఆండ్రాయిడ్ ఫోన్‌నూ లైవ్ సర్టిఫికెట్ సమర్పించవచ్చు అని తెలిపారు. సమావేశంలో గౌరవధ్యక్షుడు హనీఫ్, కార్యదర్శి గాలయ్య, కోశాధికారి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సీసీ రోడ్డు నిర్మాణ పనులు



చురుగ్గా సాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు

కోవెలకుంట్ల: మండలంలోని కంపమల్ల గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇటీవల గ్రామంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. బీసీ కాలనీలో అంతర్గత రహదారి, డ్రైనేజీ లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే నీరు నిల్వచేరి ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. గ్రామ సచివాలయానికి కేటాయించిన రూ. 10 లక్షలతో 154 మీటర్ల మేర సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు చేపట్టినట్లు గ్రామ సర్పంచ్ సోముల లోకేశ్వరరెడ్డి తెలిపారు.

ముందుకు వెళ్లలేం... వెనక్కీ రాలేం!

- డోన్ పట్టణంలో నిత్యం ట్రాఫిక్ సమస్యే
- అధికారయంత్రాంగం నిబంధనలు పట్టించుకోని వాహనచోదకులు
- పట్టనట్లు వ్యవహరిస్తున్న పోలీసులు... ప్రజలకు తప్పని ఇబ్బందులు



డోన్ పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ (ఫైల్)

డోన్ టౌన్: నియోజకవర్గ కేంద్రం డోన్‌లో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. రాకపోకలు సాగించేందుకు ప్రజలు పడరానిపాట్లు పడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి పెద్ద బజార్, పాతబస్టాండ్, స్టేట్ బ్యాంక్, ఈద్గ మజీద్, మోర్ సూపర్ మార్కెట్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. గురువారం సంతరోజు ముందుకు వెళ్లలేం.. వెనక్కీ రాలేం అన్నట్లుగా ఉంటుంది పరిస్థితి. 32 వార్డులు, 16 సచివాలయాలు ఉన్న డోన్ పట్టణంలో జనాభా దాదాపు 80 వేలు ఉంటుందని అంచనా. అదేవిధంగా వివిధ గ్రామాల ప్రజలూ చిన్న,పెద్ద పనుల నిమిత్తం డోన్‌కు వస్తుంటారు. భారీ వాహనాల రాకపోకల మూలంగానే ట్రాఫిక్ సమస్య నెలకొందని ప్రజలు వాపోతున్నారు. అధికారయంత్రాంగం ట్రాఫిక్ సమస్య నియంత్రణకు సర్వశక్తులు వడ్డుతున్నా కట్టడి కావడంలేదు. మున్సిపల్ చైర్మన్ సప్తశైలరాజేష్, కమిషనర్ వెంకటేశ్వర్లు, సీఐ మల్లికార్జున ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించినా ఫలితం దక్కలేదు. ఆటో డ్రైవర్లు, వ్యాపారుకు సమస్యలను వివరించడంతో పాటు ట్రాఫిక్ కట్టడికి విధించిన నిబంధనలు పాటించాలని పలుమార్లు సూచనలు చేసినా తీరు మారలేదు. ఫ్లైఓవర్ బ్రిడ్జికింద వాహనాలు పెట్టొద్దని చైర్మన్‌తోపాటు సీఐ పలుమార్లు సూచించారు కూడా. భారీగా జరిమానాలు విధిస్తామని హెచ్చరించినా ప్రయోజనం శూన్యంగా మారింది. అయితే పోలీసుయంత్రాంగం పట్టించుకోవడం లేదని ఆరోపణలు లేకపోలేదు.

ఇష్టారాజ్యంగా భారీ వాహనాల రాకపోకలు

పట్టణంలో భారీ వాహనాల రాకపోకలు ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి. ప్రత్యేకించి నిత్యావసర సరుకులు సరఫరా చేసే వాహనాల మూలంగానే ట్రాఫిక్ జామ్ అవుతుందని పట్టణ ప్రజలు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. పెద్ద బజార్, పాతబస్టాండ్ స్టేట్ బ్యాంక్, మోర్ సూపర్ మార్కెట్ తదితర ప్రాంతాల్లో హోల్ సేల్ దుకాణాలు ఉన్నాయి. పాత బస్టాండ్‌లో ఎరువులు, క్రిమి సంహారక మందుల అంగళ్లు ఉన్నాయి. ఆయా దుకాణాలకు ఎరువులు, సరుకులు, వస్తువులు, సరఫరా చేసే వాహనాలు రోడ్డుపైనే ఉంచుతుండడంతో ట్రాఫిక్ జామ్ అవుతుందని ప్రజలు వాపోతున్నారు. లోడింగ్, అన్‌లోడింగ్ వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు పరిస్థితి మరీదారుణంగా ఉంటుంది. ఇలాంటి సమయాల్లో ఓపిక నశించిన ద్విచక్రవాహన చోదకులు వాగ్వాదానికి దిగిన సంఘటనలు కోకొల్లలు. ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పోలీసులు పట్టించుకోవడం లేదనే ప్రజలు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ట్రాఫిక్ జామ్ అయినప్పుడు కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న పోలీసుల తీరును ప్రజలు తప్పుపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నలభైఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు

బనగానపల్లెరూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1978–80 బ్యాచ్ ఇంటర్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం పట్టణంలోని బీవీ సుబ్బారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. పూర్వ విద్యార్థి మాధవరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి అప్పటి ఫిజిక్స్ అధ్యాపకులు ఆంజనేయులు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దాదాపు 42 ఏళ్ల క్రితం చదువుకున్న విద్యార్థులందరూ ఒకేచోట కలుసుకొని పూర్వ జ్ఞాపకాలు గుర్తు చేసు కోవడం అభినదనీయమన్నారు. అనంతరం ఆంజనేయులును పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. తదనంతరం పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షునిగా మాధవరెడ్డి, సెక్రటరీగా రమణ, ట్రెజరర్‌గా అక్బార్ బాషా, అర్గనైజింగ్ సెసక్రటరీగా ఎన్ టీ నాగరాజు, గౌరవాధ్యక్షులుగా కె.హరినాథ్‌రెడ్డి, భూమా తులసిశ్వరరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పశుగ్రాసానికి పెరిగిన డిమాండ్



బనగానపల్లె: గతంలో ఎన్నడులేని విధంగా ట్రాక్టర్ వరి పశుగ్రాసానికి డిమాండ్ పెరిగింది. దాదాపు ట్రాక్టర్ వరిగ్రాసం రూ.15వేలు ధర పలుకుతున్నట్లు సమాచారం. గతంలో రైతులు ఎకరం పశుగ్రాసం రెండు నుంచి మూడువేలకు విక్రయిస్తుండగా ఈ సంవత్సరం రూ.5–6వేలకు చేయాల్సి వస్తుంది. నియోజకవర్గంలో ఎస్సార్ బీసీ ద్వారాను వ్యవసాయబోర్ల ఆధారంగా ఖరీఫ్‌లో సుమారు 27వేల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేశారు. ప్రతి రోజు ఈ ప్రాంతం నుంచి 40–50 ట్రాక్టర్ల వరకు వరిపశుగ్రాసాన్ని కొనుగోలు చేసి ప్యాపిలి, డోన్, గుత్తి కర్నూలు తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. వ్యాపారులు రూ.15–16వేలకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. పశుగ్రాసం కొనుగోలు ట్రాక్టర్ బాడుగ, కూలీల ఖర్చుపోను వ్యాపారులకు ట్రాక్టర్‌పై రూ.1500–2 వేలు మిగులుతున్నట్లు విక్రయదారులు పేర్కొంటున్నారు.

క్రీడలతో సత్సంబంధాలు



క్రీడలను ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ కొట్రికె హరికిషన్, డాక్టర్ సుంకన్న

డోన్ టౌన్: క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు సత్సంబంధాలు ఏర్పడుతాయని మున్సిపల్ వైస్ చైరన్మన్ కొట్రికె హరికిషన్, ప్రభుత్వ వైదశాల గైనకాలజిస్ట్ డాక్టర్ సుంకన్న తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో యశోధ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రెండ్లీ బాల్ బాడ్మింటన్ టోర్నమెంట్‌ను వారు ప్రారంభించారు. కర్నూలు, కొయిలకుంట్ల, గుత్తి తదితర ప్రాంతాల క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని ఈ సందర్భంగా వారు క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రభాకర్, కౌన్సిలర్ నాగేంద్ర, టెన్నిస్ బాల్ అసోషియేషన్ అధ్యక్షుడు గంగన్న పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి సాయం



నగదు, నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన నిరుపేద మాదిగ రామదాసుకు అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సమితి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక సాయం చేశారు. రామదాసుకు అనారోగ్యం కారణంగా కాలు, చేయి తొలగించారు. భార్య, కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్న రామదాసు ఆర్థిక ఇబ్బందులు గుర్తించిన ఆ సంస్థ సభ్యులు రూ.4వేల నగదుతో పాటు రూ. 8వేలతో బియ్యం ప్యాకెట్, దుప్పట్లు తదితర నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో సేవా సంస్థ అధ్యక్షుడు దోగూరి శ్రీహరి, కన్వీనర్ శ్రీరంగయ్య, ప్రధాన కార్యదర్శి శంకర్, మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయురాలు లీలా మాధురి, ఉపాధ్యక్షులు రామాంజనేయులు, నాగభూషణం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి



డోన్ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: స్వామి వివేకానందను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ పిలుపునిచ్చారు. ఈనెల 12న నిర్వహించనున్న వివేక జయంతిని పురష్కరించుకుని వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఏస్కేపి హైస్కూల్ నుంచి చేపట్టిన ర్యాలీని మున్సిపల్ చైర్మన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేకా పిలుపు మేరకు నవసమాజ నిర్మాణానికి యువత ధైర్యంతో ఉక్కులా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల స్వామి వివేకానంద వేషాధారణలు ఎంతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొట్రికె హరికిషన్, కమిషనర్ వెంకటేశ్వర్లు, వివేకానంద సేవాసమితి వ్యవస్థాపకుడు మలిశెట్టి జగన్‌మోహన్ అధ్యక్ష,కార్యదర్శులు నాగభూషణంరెడ్డి, జొన్నలగడ్డ శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షుడు తిమ్మయ్య, ఉపాధ్యక్షులు శేఖర్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటిపల్లె గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పర్యటించగా గ్రామస్తులు సీసీ రోడ్డు నిర్మించాలని కోరారు. ఈ మేరకు గ్రామ సచివాలయానికి కేటాయించిన నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామని వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బండి బ్రహ్మానందరెడ్డి తెలిపారు.

మంత్రి బుగ్గన చొరవతో గతుకుల రహదారికి మోక్షం



గ్రామంలోకి నూతనంగా వేసిన రహదారి

బేతంచెర్ల: డోన్- బేతంచెర్ల ప్రధాన రహదారి నుంచి మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామంలోకి గత టీడీపీ ప్రభుత్వ హయంలో వేసిన బీటీ రోడ్డు దెబ్బతినింది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామాన్ని సందర్శించిన ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో రూ. 11 లక్షలు మంజూరయ్యాయి. డోన్ క్రాస్ రోడ్డు నుంచి గ్రామంలోకి 800 మీటర్ల బీటీ రోడ్డు వేయడంతో గతుకుల రహదారికి మోక్షం లభించింది. దీంతో గ్రామస్తులు మంత్రి బుగ్గనకు, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

మందు బాబులకు అడ్డా.. ఆర్టీసీ బస్టాండ్ !

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలోని ఆర్టీసీ బస్టాండ్ మందుబాబులు, ఆకతాయిలకు అడ్డాగా మారింది. మూడు జిల్లాలకు సరిహద్దులో ఉన్న ఈ బస్టాండ్ మీదుగా వివిధ ఆర్టీసీ డిపో బస్సులు రాక పోకలు సాగుతుంటాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీగా ఉంటుంది. మందు బాబులు బస్టాండ్‌ను వేదికగా చేసుకొని గంటల తరబడి తిష్టవేస్తున్నారు. కొంతమంది అక్కడే కూర్చొని మద్యం సేవిస్తున్నారు. రాకపోకలు సాగించే మహిళలు బస్టాండ్‌లో కూర్చోవాలంటే ఇబ్బందులకు గురవుతున్నారు. పదుల సంఖ్యలో మందు బాబులు అక్కడే తిష్ట వేసి పిచ్చాపాటిగా మాట్లాడుతుంటారు. మహిళలు కూర్చునేందుకు వెళ్లినా ఏమాత్రం గౌరవించకుండా వ్యవహరిస్తుండడంతో చేసేది లేక రోడ్డు పక్కన ఉండాల్సి వస్తుంది. అదేవిధంగా బస్టాండ్ ప్రాంగణంలో బైక్‌లు ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తుండటంతో బస్సులు తిప్పుకునేందుకు ఆర్టీసీ డ్రైవర్లు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులతోపాటు స్థానికులు కోరుతున్నారు.

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, సీఐ ప్రియతం రెడ్డి

బేతంచెర్ల: క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, సీఐ ప్రియతం రెడ్డి, ఎస్ఐ సురేష్ తెలిపారు. పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బేతంచెర్ల మార్నింగ్ క్రికెట్ టీమ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ప్రారంభించిన వారు క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. పండుగ సందర్భాల్లో క్రీడా పోటీలు క్రీడాకారులతో పాటు క్రీడాభిమానులకు ఉత్సాహాన్నిస్తాయన్నారు. పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి 54 జట్లు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు లింగమూర్తి, పురుషోత్తం, అజామ్, తిరుమలేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులు ఐక్యత చాటుకోవాలి



మాట్లాడుతున్న గోవిందనాయుడు

కొలిమిగుండ్ల: వాల్మీకులు ఐక్యత చాటుకోవాలని, సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని వాల్మీకి పోరాట సమితి నంద్యాల జిల్లా అధ్యక్షుడు గోవింద నాయుడు సూచించారు. కొలిమిగుండ్లలోని షిర్డీ సాయి పంక్షన్ హాల్‌లో ఆదివారం కొత్తగా ఏర్పడిన మండల కమిటీ ప్రమాణ స్వీకారం అట్టహాసంగా జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్కికులు ఆర్థిక, రాజకీయ, విద్య రంగాల్లో వెనుకబడి ఉన్నారని, సమస్యల పరిష్కారం కోసం కలిసికట్టుగా పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉండాలని పిలపునిచ్చారు. గౌరవ అధ్యక్షుడుగా మాజీ ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్,మండల అధ్యక్షుడుగా ఉలవల నరసింహుడు, ఉపాధ్యక్షుడుగా హుశేనయ్య, ప్రధాన కార్యదర్శిగా బాల హుశేని నాయుడు, కోశాధికారిగా ఓబులేసు,సెక్రటరీగా సుంకప్ప, జాయింట్ సెక్రటరీగా లక్ష్మన్న ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ మండల అధ్యక్షుడు సీతా రామయ్యతోపాటు కొత్తగా ఎన్నికైన నరసింహుడిని వాల్మీకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్‌కుమార్, మాజీ ఎంపీపీ రామాంజనేయులు, నాయకులు టీసీ వెంకట్రాముడు, మద్దిలేటి, రంగస్వామి, వెంకటేష్, గోర్విమానుపల్లె సర్పంచ్ రామాంజనేయులుతో పాటు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంతంపై ప్రచారం



హుసేనాపురం గ్రామంలో భగవద్గీత పై ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని రహిమానుపురం, హుసేనాపురం గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ధర్మవరం కమిటీ సభ్యులు ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రాముఖ్యతను కమిటీ అధ్యక్షులు రామాంజనేయులు వివరించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, జయేశ్వరి, మద్దమ్మ, అనిల్, రంగస్వామి, మనోహర్, శ్రీనివాసులు, శివలక్ష్మి, కళ్యాణ్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

పాణ్యం: కొత్తూరు శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో అభివృద్ధి పనులకు ఆదివారం దాతలు విరాళం అందించారు. ముందుగా దాతలు శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నంద్యాల పట్టణానికి చెందిన దండే పెద్ద వెంకటసుబ్బయ్య, వెంకట సుబ్బమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు దండే శ్రీనివాసులు, కుటుంబ సభ్యులు రూ.77,777 నగదును ప్రధాన అర్చకుడు నారాయణస్వామికి అందించారు. ప్రస్తుతం ఆలయంలో మహాప్రాకారం, భక్తులు సౌకర్యార్థం ప్రత్యేక విడిది ఏర్పాటు పనులు జరుగుతున్నట్లు అర్చకుడు తెలిపాడు.

రబీ పంటలకు ఏప్రిల్ చివరి వరకు సాగునీరు



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: బనగానపల్లె నియోజకవర్గంలో రబీలో సాగుచేయు పంటలకు ఎస్సార్‌బీసీ ద్వారా ఏప్రిల్ చివరి వరకు సాగునీటిని విడుదల చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే కాట సాని రామిరెడ్డి తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే కాటసాని సాక్షితో మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎస్సార్ బీసీ పరిధిలో సుమారు 80వేల ఎకరాల ఆయకట్టు ఉన్నట్లు పేర్కొన్నారు. రబీలో వరితో పాటు మొక్కజొన్న ప్రొద్దు తిరుగుడు మరిన్ని పంటలను సాగు చేసుకొచ్చన్నారు. గోరుకల్లు రిజర్వాయర్‌లో నీరు సమృద్ధిగా ఉన్నందున రబీ పంటలకు ఎస్సార్‌బీసీ ద్వారా నీటిని విడుదల చేయడంలో ఎటువంటి ఇబ్బందులు ఉండదని స్పష్టం చేశారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామసుబ్రహ్మణ్యం చెప్పారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్ స్టేషన్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను తెలియజేశారు. జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

వ్యాసరచన పోటీలు

బనగానపల్లెరూరల్: పట్టణంలోని ఎస్‌వీ డిగ్రీ కళాశాలలో ఆదివారం శ్రీహట్టిమునిస్వామి దేవస్థానం, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వివేకానంద స్వామి సందేశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ నెల 12న స్వామివివేకానంద జయంతి సందర్భంగా ప్రతిభకనబరచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుతులు అందజేయనున్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా సలహాదారులు దొంతా వెంకటేశ్వర్లు, బనగానపల్లె ప్రఖండ కార్యదర్శి ఓబులరెడ్డి, ఉపాధ్యాయులు పీవీ నరసింహులు, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

15న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

ప్యాపిలి: మండల పరిధిలోని కలచట్లలో15 వ తేదీన సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించు కు ని రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ప్రవేశ రుసుము రూ. 500 చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మొదటి, రెండవ, మూడవ బహుమతులు రూ.రూ.40 వేలు, రూ.30వేలు, రూ.20 వేలు చొప్పున అందజేస్తామన్నారు. అదేవిధంగా నాలుగు, ఐదు, ఆరు స్థానాల్లో నిలిచిన వృషభాల యాజమాన్యాలకు వరుసగా రూ. 10 వేలు, రూ. 5 వేలు, రూ.3 వేలు చొప్పున అందజేస్తామని వివరించారు.

22న పూర్వవిద్యార్థుల సమ్మేళనం

డోన్ : స్థానిక గుండా వెంకటరత్నంశెట్టి డిగ్రీ కళాశాల 1978–85 సంవత్సరాల బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఈనెల 22వ తేదీన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎస్‌కే నబీ ఒక ప్రకటనలో తెలిపారు. గుత్తి రోడ్డులోని కళాశాల ఆవరణలో సహచరులతో ఆత్మీయ సమ్మేళనం, గురువులకు సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

దూసుకొచ్చిన బొలేరో

– ఒకరికి గాయాలు.. వాహనాల ధ్వంసం



వాహనాలను ఢీకొన్న బొలేరో

ప్యాపిలి: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి బొలేరో దూసుకరావడంతో యువకుడు గాయపడగా పలు వాహనాలు ధ్వంసం అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు నడిమిగేరిలో బొలేరో డ్రైవర్ తలారి నాగరాజు మద్యం మత్తులో వాహనాన్ని అతివేగంగా నడిపాడు. దీంతో వాహనం అదుపు తప్పి దూసుకువచ్చింది. ఈ ప్రమాదంలో రామకృష్ణ అనే యువకుడికి గాయాలు కావడంతోపాటు ఓ ఆటో, ఎద్దులబండి, మూడు ద్విచక్ర వాహనాలు ధ్వంసం అయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

నివాళి



బాలకృష్ణమ్మ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నాయకులు

బనగానపల్లెరూరల్: ఏపీటీఎఫ్ వ్యవస్థాపకులు మార్పు బాలకృష్ణమ్మ వర్ధంతిని ఆదివారం స్థానిక కార్యాలయంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలకృష్ణమ్మ సేవలను ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మాధవ స్వామి గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా సహ అధ్యక్షుడు మధుసూదన్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు లింగమయ్య, నాయకులు నాగరాజు, మండల శాఖ అధ్యక్షుడు వెంకటకృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి సుంకన్న తదితరులు పాల్గొన్నారు.